# అందని ఆదర్శం

"కాఫీ ఎట్లావుందీ!" అని అడిగింది పేపరు చదువు తున్న భర్తను శాంత ఆదుర్దాగా.

అతను మాట్లాడలేదు. ఎక్కడో స్వప్నలోకంలో నగిషీ చెక్కిన చీనాకప్పుల్లో, వేడి వేడికాఫీ పొగలూరుతోంది, ఆ కాఫీ అతను రుచిచూడలేదు. కాని ఏకాఫీకి దాని రుచిలేదు.

శాంతకి అతని మౌనం అర్థంకాకపోలేదు. అతను ఎప్పుడూ జవాబు చెప్పడు. ఎప్పుడైనా చాలా బలవంతంచేస్తే ముభావంగా "బాగానే ఉన్నది" అంటాడు. అయినా పది హేనేళ్ళనుంచి మంచి కాఫీచేసి అతని మెప్పును పొందాలన్న ప్రయత్నం ఆమె ఎప్పుడూ మానుకోలేదు. ప్రతిసారి విసుగు లేకుండా అడుగుతూనే ఉంటుంది, "ఎట్లావుంది" అని, అంతే.

కాస్సేపటికి భర్త మాట్లాడాడు.

"మొన్న పోటీకి కథ పంపించాను చూశావూ? ఆ రిజల్టు ఇవ్వాళ తెలుస్తుంది" అన్నాడు. 'ఆహా' అన్నది శాంత లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుంటూ. ఎప్పుడో ఆరు నెలలక్రిందట వ్రాసి పంపిన కథ ఆ విషయం జ్ఞాపకం చేసు కోటానికి ప్రయత్నించింది. ఆ వేళ అతను చదువుతూవుంటె తను నిద్దరపోతూ కళ్ళునులుముకుంటూ విన్నది. అతను అమితోత్సాహంతో ఆ కథ ఎంతో బాగున్నదనుకున్నాడు. తనకిమాత్రం అట్టె నచ్చలేదు. అయినా ఆమాట అతనికి

చెప్పలేదు. ఆ కథ ఏమిటో తనకి బాగా జ్ఞాపకం రాలేదు. తనకెందుకు బాగుండలేదో! ఇంకొకసారి చదివితే! ఏమో!

అతను ఇంకా ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు.

"ప్రథమ బహుమతివస్తే ఎంత బాగుంటుంది. చక్కగా 500 రూపాయలు. నిన్ను కాశ్మీర్ తీసుకుపోతాను" హుషారుగా నవ్వాడు. ఆ కంఠంలో బహుమతి రాదేమోనన్న సందేహమెక్కడా వినిపించలేదు. తనకన్న ఎవరు బాగా వ్రాయగలరు, అన్న గర్వం బహుమానం తనకు రాకపోతే ఇంకెవరికివస్తుందన్న ధీమా ప్రతిధ్వనించినవి.

శాంత నిట్టూర్చింది. 500 రూపాయలు వస్తే ఏమి చెయ్యవచ్చునో ఆమె ఆలోచించుకోసాగింది. ఒక లక్ష ఖర్చులు ఆమె కళ్ళముందు నాట్యమాడినవి. అసలు ఆ డబ్బు ఎందుకూ సరిపోదు. కాని ఆ బహుమతివస్తే తనభర్త సంతోషిస్తాడు. అది అతనికెంతో గౌరవం!

కిటికీలోనుంచి చల్లనిగాలి విసరింది. ఆకాశమంతా మేఘావృతమైంది. నల్లని మబ్బులు అటూఇటూ పరుగెడుతున్నాయి. ఎడతెఱపిలేని వాన కురియటానికి వాగ్దానం చేస్తున్నది. ఆమె ఒక్కక్షణం ఆకాశంకేసి చూస్తూ ఉండిపోయింది. ఏదో స్ఫురణకు వచ్చింది. ఎప్పుడో చిన్నప్పుడు ఒకసారి ఆకాశంకేసి చూస్తూఉండిపోయింది. నల్లని మబ్బు కొసలలో అస్తమిస్తున్న సూర్యుని వెండికిరణాలు పడి తళతళ మెరుస్తున్నాయి. అది చూస్తున్నంతసేపు ఆమె మనస్సులో ఒక్కటే కోరిక మెరిసింది. వెండి జరీపూలతో నీలిమబ్బుచీర కట్టుకొని తనూ ఒక మబ్బుకన్యలా ఉండగలిగితే! ఆ కోరి

కను ఆమె సిగ్గుపడింది. కాని ఆకాశంలో మేఘాలు చూసినప్పుడల్లా ఆ ఆశ మనస్సులో కదులుతూనేఉంటుంది. ఎన్నేళ్లు గడచినా అది అణగిపోనేలేదు!

చలిగాలి ఎక్కువవుతుందేమోనని కిటికిమూసింది. అతను కాఫీత్రాగి ముందుగదిలోకి వెళ్ళాడు. ఖాళీకప్పు చేతిలో పట్టుకొని ఆమె వంటయింటివైపు వెళ్ళింది. ఒక్కక్షణంలో గృహకార్యాల్లో మునిగిపోయింది.

రోజంతా వాన కురుస్తూనేవున్నది. మధ్యాహ్నం మండువాలో కూర్చుంది. అప్పుడే వాన కొద్దిగా తగ్గుముఖం పట్టింది. గాలి ఎక్కువగా వచ్చినప్పుడల్లా చిన్నచిన్న వాన తుంపరలు మంచుబిందువుల్లా ముఖంమీద పడుతున్నాయి. ముసురుగావుంటే మనస్సంతా మసకగానే ఉంటుంది. ఏదో చికాకుగా ఉంటుంది. ఆ చల్లగాలి, నీటిజల్లు ఆహ్లాదకరంగా వున్నా, ఏదో నిరాశ కలిగిస్తోంది.

పెరటివేపునించి నాగన్న కంఠస్వరం అవ్యక్తంగా వినిపిస్తోంది. అది రోజూ మామూలే. మధ్యాహ్నం గిన్నెలు కడుగుతున్నప్పుడల్లా నాగన్న తనగోడు కొళాయితో చెప్పుకుంటూవుంటాడు. గిన్నెల చప్పుడుతో మేళవించి, కొళాయి నీటితో ఏకీభవించి నాగన్న గొణుగుడు అస్పష్టమైన రోదన ధ్వనిగా పరిణమిస్తుంది. ఇవ్వాళ అది వానహోరుతో కలిసి కదలిపోతోంది.

ఎప్పుడో కొన్నాళ్ళక్రిందట నాగన్నమామ రంగం పోయి ఆరునెలల్లో ఆరువందలు సంపాదించుకువచ్చాడు. అప్పటినుంచి నాగన్నతత్వం మారింది. తనూ రంగంపోతే!

అతని హృదయంలో ఆశ రేకెత్తింది! ఇక్కడ ఎన్నాళ్ళు కూడబెడితే ఆరువందలు కాను: కాని రంగం ఎట్లాపోవాలో ఏంచెయ్యాలో వాడికి తెలియదు. అనుకుంటూనే రోజులు గడిచిపోతున్నాయి. వాడికి జీవితంమీద విరక్తికలుగుతోంది. ఆ నిరాశ అంతా గిన్నెలు తోమేటప్పుడే ఉబికివస్తుంది. రంగం అంటే ఏదో స్వర్గమని వాడి భ్రమ!

నాగన్న వచ్చి చెప్పాడు. "మీకోసం అతనెవరో వచ్చాడు" అని.

శాంత ముందు సావిట్లోకి వెళ్ళింది. కనకయ్య బట్టల మూటతో కూర్చుని ఉన్నాడు.

'ఇదేమిటయ్యా, ఇంతవానలో వచ్చావు' అన్నది.

"ఇవ్వాళే వచ్చానండి. మళ్ళీ రేపు వెళ్ళిపోవాలి. మీరు నెయ్యమన్నారూ? ఆచీర తెచ్చాను" అన్నాడు.

ఏ చీర! ఎప్పుడో ఏడాదిక్రిందట చెప్పింది. చప్పున గుర్తురాలేదు. కనకయ్య చీరతీసి చూపాడు. ముదురు నీలం జరీచీర. శాంతకి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాని తాను చెప్పిన చీర అదికాదు. లేత మబ్బురంగు వెండి జరీ పువ్వులు, బంగారురంగు అంచు, ఇంకా ఏమేమో చెప్పింది. పాపం అతనికి అర్థమైనట్లులేదు. ఆ చీర తను అనుకున్నట్టు తేలిపోతూన్న మేఘంలా లేదు. చెయ్యిజారి సిరా వలకబోసి నట్లున్నది.

కాని తన నిరాశ నతనికి చూపించలేదు. చీర నచ్చ లేదని చెప్పలేదు.

"సరే, ఉంచి వెళ్ళండి" అన్నది.

"చిత్రం, అరవైరూపాయలైందండి ఆ చీర అసలు ఖరీదు, చాల శ్రమపడి తయారుచేయించాను. కొంచెం ఇప్పుడే ఇప్పిస్తే వీలుగా ఉంటుంది" అన్నాడు.

శాంతకు నవ్వువచ్చింది. తద్దినం కొనితెచ్చుకున్నట్లున్నది. తన కక్కరలేదని చీరతప్పనిసరిగా కొనుక్కోవలసి రావడం !

ప్రొద్దున మూసిన కిటికీలు మళ్ళా సాయంత్రం తెరచింది. వానవెనుకబట్టిందిగాని, చీకటి ముసురుకొస్తున్నది. దూరాన కొండశిఖరాలు మేఘాల్లో కలిసిపోయి ఆనవాలు కూడా తెలియటంలేదు.

ఎప్పుడో ఎగ్జిబిషన్‌లో చూచిన అమెరికన్ చిత్రం ఒకటి జ్ఞాపకంవచ్చింది. అందులో ఏమీలేదు. ఎత్తైన కొండ శిఖరాలు మంచుతో నిండిఉన్నాయి. ఆ కొండచుట్టూ గడ్డి పూలు విరియబూచి ఉన్నాయి. ఆ శిఖరాలు ఆకాశాన్నందు కోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఆ గడ్డిపూలు ఆ కొండ పాదాలను ముద్దుపెట్టుకుంటున్నాయి. ఆ బొమ్మలో అంత రార్థం ఏమిటో? ఆచిత్రం తన్ను విపరీతంగా ఆకర్షించింది. ఎందుకో ?

వీధివాకిలి చప్పుడైంది, సైకిలుత్రోసుకుంటూ బాబు లోపలికివచ్చాడు. చాల అలసిపోయినట్లున్నాడు.

"ఇవ్వాళ ఇంత ఆలస్యం అయిందేరా ?" అన్నది శాంత.

"ఊం, వర్షం తగ్గుతుందేమోనని ఉండిపోయాను" అన్నాడు విసుగ్గా. చేతిలో ఏదోకాగితాలకట్ట ఉన్నది.

"నీ పేపరు ఇచ్చారా ఏంరా?" అన్నది.

"ఆ" అన్నాడు.

"ఎన్ని మార్కులు వచ్చాయి?" ఆత్రంగా అడిగింది.

"57" అని చిరాకుగా అని కాగితాలకట్ట ఆవిడదగ్గరగా పడేశాడు. ఎంత కష్టపడి చదివినా మార్కులు అంతకు మించవు. ఆ మిగతా మార్కులు ఎందుకురావో వాడికి అర్థం కాదు.

శాంత ఓదార్పుగా అన్నది. "ఈసారి బాగా చదువుదువుగాన్లే"

"అవున్లే" వెక్కిరింపుగా అని లోపలికి వెళ్ళాడు.

ఇంకా రాత్రి కాకపోయినా దీపాలు వెలిగించింది. ఆ దీపాల వెలుగులో కూడ ఇల్లు ఎందుకో కాంతివిహీనంగా కనుపించింది. ఏదో చెప్పలేని ఒంటరితనం, నిరాశ, భయం ఇల్లంతా వ్యాపించాయి.

అతను వచ్చాడు. చేతిలో ఆ సాయంత్రం పేపరు కనుపించింది. "ఏమైంది ఏమైంది" అన్నప్రశ్న తొందరగా ఆమె పెదవులదాకావచ్చి ఆగిపోయింది. అతని ముఖం చూస్తే అడగ బుద్ధి పుట్టలేదు. పేపరు తీసుకొని తనే చూసింది. అతనికి ద్వితీయ బహుమానం వచ్చింది. తగిన కథ లేక ప్రథమ బహుమానం ఎవరికి ఇవ్వలేదట. ఒక్కక్షణం శాంత నిరాశ చెందింది. కాని మళ్ళీ ఉత్సాహం తెచ్చుకుంది. "పోనిద్దురూ, మొదటి బహుమానం అసలెవ్వరికి రాలేదుగా?" అన్నది.

అతను తలయెత్తి చిరాకుగా వెక్కిరింపుగా అన్నాడు.

"అదికాదు మన కథ మొదటి బహుమానానికి పనికి రాలేదుగదా! ఇంకొకరికి వస్తేనేం రాకపోతేనేం ?"

శాంత మాట్లాడలేకపోయింది, అక్కడ ఉండి చేసేది లేక లోపలికి వెళ్ళింది. కాస్సేపటికి కాఫీ తెచ్చి బల్లమీద పెట్టింది.

"త్రాగండి చల్లారిపోతుందేమో?" అన్నది.

అతను ధ్యానసమాధిలోనుంచి తొందరగా మేల్కొన లేదు. ఈసారి శాంత కాఫీ "ఎట్లా ఉంది?" అని అడగలేదు.

వేడికప్పులో నుంచి సన్నని పొగ తెరలు తెరలుగా లేచి చూరును అందుకోవాలని ప్రయత్నిస్తోంది కాని మధ్య లోనే మాయమైపోతోంది.

బయట అంతా చీకటిమయం. మబ్బుతెరలను చీల్చు కొని ఒక్క క్షణం ఓ చిన్ననక్షత్రం కిటికీలో నుంచి తొంగి చూచింది. మళ్ళీ మాయమై పోయింది.